



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -71 శనివారం15 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


## పరీక్షల సంస్కరణలతో యువతకు భరోసా



### జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నేడు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- గడిచిన పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చరిత్రాత్మక విజయమన్న రాష్ట్రపతి

2లో.

# విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన

- చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు
- నర్సరీ నుంచి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
- కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
- గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు దూరం చేసింది



### పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్



**హైదరాబాద్,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త): :**చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల్ **మిగతా 2లో...**

## నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

- నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ, /ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి **మిగతా 2లో...**



## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

- మూడు దశల ఆధునీకరణ ప్రణాళికలో భాగంగా రెండో విడతలో ఈ వాహనాల కొనుగోలు
- ప్రమాదాలకు వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

**అమరావతి, /ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాజధాని అమరావతిలోని సీడ్ **మిగతా 2లో...**

## అరుదైన గౌరవం

### పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు



## సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

- రాహుల్ గాంధీకి భారీ ఊరట..
- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు
- యూపీ ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని గుర్తించిన సుప్రీం
- 2022 భారత్ జోడో యాత్రలో రాహుల్ వ్యాఖ్యలు
- 153ఏ, 505 సెక్షన్ల కింద దిగువ కోర్టు సమన్లు



2లో.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

### తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

- డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా



**హైదరాబాద్,ఆ/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు **మిగతా 2లో...**



## నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలన్న నిమ్మల
- ఏపీ అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడి
- నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు వ్యవహరించాలన్న నిమ్మల

**అమరావతి, /ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం నీటిని వినియోగించుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల సమస్యలను పరిష్కరించుకోవడానికి**మిగతా 2లో...**

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

**న్యూఢిల్లీ,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు.
శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.
అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

**మొదటిపేజీ తరువాయి**
సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (÷ూఅః౦) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు.
'ఇదంతా పూర్తిగా అనవసరమైన పక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷-లెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

## రాహుల్ గాంధీకి భారీ ఊరట..

**/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది.
జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది.
2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

# నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

**మొదటిపేజీ తరువాయి**
గోదావరి నదీ యాజమాన్య బోర్డు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఖ=వీడీ) సమావేశాలు ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి ఉన్న అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎమ్‌బీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. జీఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు పరస్పరం వ్యవహరించాలని సూచించారు.
ఇదే క్రమంలో గోదావరి - కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై కూడా ఆయన మాట్లాడారు. ఈ అనుసంధానానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు.

# అరుదైన గౌరవం

## పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు

**హైదరాబాద్,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** :తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.
ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి.
ప్రతి ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

----------------

# పరీక్షల సంస్కరణలతో యువతకు భరోసా

## జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.



**ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు**
ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దేశం ముందంజ**
గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కింద దాదాపు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు.

**యువశక్తికి, మహిళా సాధికారతకు పెద్దపీట**
ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి పారదర్శకతను పాటిస్తామని ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. దేశ జనాభాలో 65 శాతం ఉన్న 35 ఏళ్లలోపు యువతే స్టార్టప్ వ్యవస్థకు చోదక శక్తిగా నిలుస్తోందని, దేశ ఉజ్వల భవిష్యత్తుకు వారే సారథులని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి ప్రజాస్వామ్య పునాదులు బలపడుతున్నాయని అన్నారు. క్రీడల నుంచి రక్షణ రంగం వరకు మహిళలు సాధిస్తున్న విజయాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

**అంతర్గత భద్రత, సామాజిక పురోగతి**
దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చారిత్రాత్మక విజయమని రాష్ట్రపతి అభివర్ణించారు. ఒకప్పుడు మావోయిజంప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు సమ్మిళిత అభివృద్ధి జరుగుతోందని, ఇటీవల బస్తర్‌లో జరిగిన 'బస్తర్ ఒలింపిక్స్' ఇందుకు నిదర్శనమని చెప్పారు. 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా దేశంలో క్రీడా పర్యావరణ వ్యవస్థ బలోపేతమై, అంతర్జాతీయ పోటీలలో మన క్రీడాకారుల ప్రదర్శన గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రజా భాగస్వామ్యం (జన్ భాగీదారీ) అనేది మన దేశ సంప్రదాయమని, పౌరుల భాగస్వామ్యంతోనే జాతీయ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోందని తెలిపారు. ఈ సందర్భంగా దేశ విభజన నాటి భయానక పరిస్థితులను గుర్తుచేసుకుంటూ, 500కు పైగా సంస్థానాలను ఏకం చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె నొక్కిచెప్పారు. ప్రసంగం ప్రారంభానికి ముందు, పార్సీ నూతన సంవత్సరం 'నవ్రోజ్' సందర్భంగా దేశ విదేశాల్లోని పార్సీ సోదర సోదరీమణులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన

**మొదటిపేజీ తరువాయి**
విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా ఫూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా ఫూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు.

# 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

**మొదటిపేజీ తరువాయి**
యాక్సెస్ రోడ్డులో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన అగ్నిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత వేగంగా, సమర్థవంతంగా స్పందించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టారు.
కొత్తగా సమకూర్చిన ఈ వాహనాల్లో గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు, భారీ ప్రమాదాల సమయంలో నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యం గల 20 వాటర్ బౌజర్లు ఉన్నాయి. వీటితో పాటు ఇరుకైన, రద్దీ ప్రదేశాల్లోకి వేగంగా చేరుకునేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ వాహనాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశారు. అగ్నిమాపక శాఖను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం మొత్తం మూడు దశల్లో రూ.252.86 కోట్లతో ప్రణాళికను అమలు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఇప్పటికే రూ.33 కోట్లతో 65 వాహనాలను అందుబాటులోకి తీసుకురాగా, తాజా ప్రారంభోత్సవం రెండో దశకు చెందింది. మూడో దశలో మరిన్ని వాహనాలతో పాటు అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు. వాహనాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త ఫైర్ స్టేషన్ల నిర్మాణం, 36 పాత స్టేషన్ల ఆధునికీకరణ పనులు కూడా జరుగుతున్నాయి.
ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వాహనాల పనితీరు, ప్రత్యేకతలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రమాదాలకు త్వరితగతిన స్పందించి, ప్రాణ, ఆస్తినష్టాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టినట్లు వారు తెలిపారు.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

**మొదటిపేజీ తరువాయి**
స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు.. సామాన్యుడికి స్వేచ్ఛ ఎక్కడ?

**ఆగస్టు 15 ప్రత్యేక వ్యాసం (జర్నలిస్ట్ వార్త)**

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయ్యాయి. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొంది భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదిగింది. చంద్రుడిపై అడుగుపెట్టింది.. అణుశక్తిలో అగ్రదేశాలతో పోటీపడుతోంది.. డిజిటల్ విప్లవంలో దూసుకుపోతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోంది. నగరాలు ఆకాశహర్మ్యాలతో మెరిసిపోతున్నాయి. కానీ.. ఈ మెరుపుల మధ్య మట్టి బాటలో నడుస్తున్న సామాన్యుడి బతుకు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది.జెండా మారింది.. పాలకులు మారారు.. కాలం మారింది.. కానీ పేదవాడి బతుకు ఎందుకు మారడం లేదు?

ఇదే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశం తనను తాను వేసుకోవాల్సిన ప్రశ్న.పుట్టుకే భవిష్యత్తును నిర్ణయిస్తోందా?

ఒక ధనవంతుడి ఇంట పుడితే అవకాశాలు గుమ్మం ముందే ఉంటాయి. మంచి పాఠశాల.. మంచి వైద్యం.. విదేశీ విద్య.. పోటీ పరీక్షలకు ఖరీదైన శిక్షణ.. అవసరమైన సాంకేతిక వసతులు.. అన్నీ అందుబాటులో ఉంటాయి.రాజకీయ కుటుంబంలో పుడితే రాజకీయ వేదిక సిద్ధంగా ఉంటుంది. డాక్టర్ ఇంట పుట్టిన బిడ్డకు వైద్య విద్యపై అవగాహన, వనరులు అందుబాటులో ఉంటాయి. ఇంజనీర్ కుటుంబంలో పుట్టిన పిల్లవాడికి సాంకేతిక విద్యపై మార్గదర్శకత్వం ఉంటుంది.కూలీ ఇంట పుట్టిన పిల్లవాడికి?చిన్న రైతు ఇంట పుట్టిన బిడ్డకు?

రోజువారీ కూలితో కుటుంబాన్ని నెట్టుకొచ్చే తల్లిదండ్రుల బిడ్డకు?వారి ముందు నిలిచేది అవకాశాల కంటే ముందు ఆర్థిక ఇబ్బందులే. ప్రతిభ ఉన్నా పేదరికం అడ్డుగోడగా మారుతోంది. చదువుకోవాలన్న ఆశ ఉన్నా కుటుంబ పరిస్థితులు వెంటాడుతున్నాయి.

ఇది ఎవరి వైఫల్యం?

అన్నదాతకు ఎందుకీ కన్నీరు?

దేశానికి అన్నం పెట్టే రైతు మాత్రం అప్పుల ఊబిలో ఎందుకు కూరుకుపోవాలి? విత్తనం నుంచి ఎరువు వరకు.. పురుగుమందు నుంచి కూలి వరకు అన్నీ ఖర్చే. పంట చేతికొచ్చే సమయానికి ధర కోసం మరో పోరాటం. ప్రకృతి కన్నెర్ర చేస్తే నష్టం.. మార్కెట్ కన్నెర్ర చేస్తే నష్టం.చిన్న, సన్నకారు రైతుకు భూమి ఉన్నా పెట్టుబడి సమస్య. పంట ఉన్నా ధర సమస్య. నష్టం వస్తే



అప్పు తీర్చే మార్గం సమస్య.

రైతు పంట పండిస్తాడు.. దేశం పండుతుంది. కానీ రైతు కుటుంబం ఎందుకు నిలదొక్కుకోలేకపోతోంది?

ఈ ప్రశ్నకు ప్రభుత్వాల వద్ద కేవలం పథకాల జాబితా కాకుండా.. ఆచరణలో కనిపించే సమాధానం కావాలి.

పేదరికం నుంచి విముక్తి ఎప్పుడు?

స్వాతంత్ర్యానికి ముందు మన శత్రువు బ్రిటిష్ పాలన. నేడు మన ముందున్న శత్రువులు పేదరికం, నిరుద్యోగం, అవినీతి, అసమానతలు.

దేశం అభివృద్ధి చెందుతున్నా ఆ అభివృద్ధి ఫలాలు చివరి కుటుంబానికి చేరకపోతే ఆ ప్రగతికి పరిపూర్ణత ఎక్కడ?ఒకవైపు కోట్ల రూపాయల ప్రాజెక్టులు.. మరోవైపు ఒక చిన్న కుటుంబం వైద్యం కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి. ఒకవైపు ప్రపంచ స్థాయి విద్యాసంస్థలు.. మరోవైపు గ్రామీణ పేద విద్యార్థి సరైన పుస్తకం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి.

అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు కాదు. మనిషి జీవన ప్రమాణం పెరగడం.

ప్రభుత్వ పథకం.. ప్రజల హక్కు

ప్రభుత్వాలు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. కానీ పథకం ప్రకటించడం ఒక ఎత్తయితే.. అది నిజమైన లబ్ధిదారుడి గుమ్మం చేరడం మరో ఎత్తు.అర్హుడికి పథకం అందడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదు. లంచం అనే మాట వినిపించకూడదు. పేదవాడి హక్కు అతని ఇంటి తలుపు తట్టేలా పాలన ఉండాలి.ప్రభుత్వ కార్యాలయం ప్రజల కోసం.. ప్రజలు ప్రభుత్వ కార్యాలయం కోసం కాదు.

యువతకు అవకాశాలే నిజమైన స్వాతంత్ర్యం

దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని ప్రతి నాయకుడు చెబుతాడు. కానీ ఆ యువతకు తగిన ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, స్వయం ఉపాధి అవకాశాలు ఎంతవరకు అందుతున్నాయో కూడా పాలకులు సమీక్షించాలి.డిగ్రీలు చేతిలో పట్టుకుని ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న యువతకు స్వాతంత్ర్యం అంటే ఏమిటి?ఉద్యోగం అడిగే చేతులకు పని.. కష్టపడే చేతులకు గౌరవం.. ప్రతిభకు తగిన అవకాశం లభించినప్పుడే యువతకు నిజమైన స్వేచ్ఛ.

స్వాతంత్ర్యం అంటే పండుగ మాత్రమే కాదు

ఆగస్టు 15న జెండా ఎగురవేస్తాం. దేశభక్తి గీతాలు ఆలపిస్తాం. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటాం. ఇది మన బాధ్యతే.

అయితే అదే రోజు మన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా ఒకసారి పరిశీలించాలి.మన గ్రామంలో పేదవాడి ఇల్లు ఎలా ఉంది?రైతు పరిస్థితి ఎలా ఉంది?కూలీ కుటుంబం పిల్లలు చదువుతున్నారా?

యువతకు పని ఉందా?వృద్ధులకు భరోసా ఉందా? ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవాడికి నాణ్యమైన వైద్యం అందుతోందా?ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి.

మరో స్వాతంత్ర్య పోరాటం

ఇప్పుడు మనకు అవసరమైన పోరాటం విదేశీ పాలకులపై కాదు. అసమానతలపై. పేదరికంపై. అవినీతిపై. నిరుద్యోగంపై. అవకాశాల అసమానతపై. కూలీ బిడ్డ కూడా డాక్టర్ కావాలి. రైతు బిడ్డ కూడా ఇంజనీర్ కావాలి. పేద కుటుంబం నుంచి వచ్చిన ప్రతిభావంతుడు కూడా ఉన్నత పదవికి చేరాలి. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినవారికి ఉన్న అవకాశాలు సామాన్య కుటుంబాల పిల్లలకు కూడా అందాలి.పుట్టిన కుటుంబం కాదు.. ప్రతిభే భవిష్యత్తును నిర్ణయించే భారతదేశం కావాలి.

అదే నిజమైన స్వాతంత్ర్యం.జెండా నీడలో చివరి ప్రశ్న

79 ఏళ్ల స్వతంత్ర భారతదేశం ఎన్నో విజయాలు సాధించింది. ఆ విజయాలను గర్వంగా చెప్పుకోవాలి. కానీ అదే సమయంలో మన వైఫల్యాలను ప్రశ్నించడానికి కూడా వెనుకాడకూడదు.

పేదవాడి కంట కన్నీరు ఉన్నంతకాలం.. రైతు గుండెల్లో అప్పుల భారం ఉన్నంతకాలం.. కూలీ బిడ్డకు అవకాశాల కోసం పోరాటం తప్పనిసరిగా ఉన్నంతకాలం.. మన స్వాతంత్ర్య ప్రయాణం ఇంకా పూర్తి కాలేదనే చెప్పాలి.ఆగస్టు 15న జెండాకు సెల్యూట్ చేస్తూ ఒక్కసారి మనసాక్షిని కూడా ప్రశ్నించుకుందాం.దేశం ఎంత ఎదిగింది?" అన్న ప్రశ్నతోపాటుదేశంలోని చివరి మనిషి ఎంత ఎదిగాడు?అని అడుగుదాం.

ఆ రోజు నుంచే స్వాతంత్ర్య దినోత్సవానికి మరో అర్థం వస్తుంది.స్వాతంత్ర్యం అంటే కేవలం పరాయి పాలన నుంచి విముక్తి కాదు..ప్రతి మనిషి గౌరవంగా, సమాన అవకాశాలతో, ఆత్మగౌరవంతో బతికే హక్కు.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)
టి.యు.డబ్ల్యూ.జే. (ఐజేయూ) జిల్లా కార్యవర్గ సభ్యులు
ఫోన్: 99084 01581

## ఆర్‌బీఎస్‌కే లక్ష్యాలు సాధించకుంటే చర్యలు తప్పవు



**మహబూబాబాద్/ ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా చేపడుతున్న కార్యక్రమాల్లో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**సమన్వయంతో ముందుకు..**

వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆర్‌బీఎస్‌కే అమలులో మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ముందువరుసలో నిలపాలని డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాళోజీ.. తెలంగాణ ధిక్కార స్వరం

### కవితల స్ఫూర్తితోనే అధికార మార్పిడి -కాళోజీ కళాక్షేత్రం సందర్శనలో సీపీఐ నేత నారాయణ







**హనుమకొండ/బ్యూరో ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** తెలంగాణ ప్రజల గొంతుకగా, ధిక్కార స్వరంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు నిలిచారని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ అన్నారు. కాళోజీ కవితల్లోని స్ఫూర్తిని తెలంగాణ ప్రజలు ఆచరణలో చూపించారని, పాలకుల పనితీరును గమనించి అధికార మార్పిడికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.శుక్రవారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి నారాయణ సందర్శించారు. కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాళోజీ ఉపయోగించిన వస్తువులు, ఆయన రచనలు, కవితల పుస్తకాలను పరిశీలించారు.

**నత్తనడకన నిర్మాణం..**

కాళోజీ కళాక్షేత్రం నిర్మాణానికి 2014లో శిలాఫలకం వేసిన సమయంలో తాను హాజరైనట్లు నారాయణ గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం పునాది వేసి పనులను నత్తనడకన సాగించిందని, చివరకు పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కళాక్షేత్రాన్ని ప్రారంభించిందన్నారు.



**ఉద్యమ ఆకాంక్షలు విస్మరణ**

'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే పాతర వేస్తం' అంటూ కాళోజీ రాసిన కవితను నారాయణ ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను విస్మరించిందని ఆరోపించారు. కాళోజీ పేరుతో నిర్మిస్తున్న కళాక్షేత్రానికి శిలాఫలకం వేసి పనులు పూర్తి చేయకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజా ఆకాంక్షలకు భిన్నంగా పాలన సాగించినందుకే గత ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిందని వ్యాఖ్యానించారు.


**హామీలు అమలు చేయాలి**

సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈ నెల 6 నుంచి 14 వరకు కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు నారాయణ తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్‌లో పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.ఎ. స్టాలిన్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు ల్యాదల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.







# కౌశిక్‌రెడ్డిని హుజురాబాద్‌లో ఉంచకండి

## హైదరాబాద్‌కు తీసుకెళ్లండి.. బీఆర్ఎస్ నేతలకు వాసాల రామస్వామి సూచన

**జమ్మికుంట/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హుజురాబాద్‌లో ఉంచకుండా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని జమ్మికుంట మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి బీఆర్ఎస్ అధిష్ఠానానికి సూచించారు. హుజురాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ప్రభుత్వాన్ని, మంత్రులను ఒప్పించి పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన పథకాలు, మౌలిక వసతుల కోసం కృషి చేయాల్సిన సమయంలో కౌశిక్‌రెడ్డి అల్లర్లు, గొడవలను ప్రోత్సహించడం సరికాదని విమర్శించారు. పోలీస్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేయడం, అధికారులను దూషించడం, రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం, మంత్రులు, ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం వల్ల ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతుందని రామస్వామి ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, రోడ్లు, ఇళ్లు, సంక్షేమ పథకాలపై



ప్రభుత్వాన్ని ప్రశ్నించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాజకీయ గొడవలతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.
బీఆర్ఎస్ నేతలు కళ్లు తెరవాలికౌశిక్‌రెడ్డి రాజకీయ విధానాల వల్ల ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతోందో బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా ఆలోచించాలని రామస్వామి అన్నారు. ఆయన రాజకీయ విధానాలను సమీక్షించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలిపై ఆ పార్టీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. గత ఉపఎన్నికల రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఈటల రాజేందర్, కేసీఆర్ మధ్య రాజకీయ విభేదాల నేపథ్యంలో మూడో వ్యక్తిగా కౌశిక్‌రెడ్డిని హుజురాబాద్ ప్రజలపై రుద్దారని ఆయన ఆరోపించారు. ఈటల రాజేందర్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారని, ఇప్పుడు కౌశిక్‌రెడ్డిని కూడా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని కేసీఆర్, కేటీఆర్, వినోద్‌కుమార్‌లను కోరారు. అభివృద్ధే ప్రజలకు కావాలికౌశిక్‌రెడ్డి చేస్తున్న రాజకీయ గొడవలను హుజురాబాద్ ప్రజలు ఇక భరించే పరిస్థితిలో లేరని రామస్వామి అన్నారు. హుజురాబాద్‌ను అభివృద్ధి బాటలో నడిపించే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ప్రణవ్‌బాబు ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం, వ్యక్తిగత రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కౌశిక్‌రెడ్డికి హితవు పలికారు.

# మైనర్ల చేతికి వాహనాలిస్తే కేసులే!

### రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు -ట్రిపుల్ రైడింగ్, అతివేగంపై ప్రత్యేక నిఘా

### జిల్లాలో ఇప్పటివరకు 17 మంది మృతి.. ఒక్క ప్రాణం కూడా పోకుండా చర్యలు: కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్/ ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారని, భవిష్యత్తులో ఒక్క ప్రాణం కూడా పోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**ఐదు వాహనాలు సీజ్**

మైనర్లు వాహనాలు నడపకుండా కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి ఇప్పటికే ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**జంక్షన్లపై ప్రత్యేక దృష్టి**

ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రధాన జంక్షన్లను గుర్తించి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోపాటు రహదారులపై ఉన్న చిన్నచిన్న మరమ్మతులను వెంటనే




పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్, పోలీసు, రవాణా, ఆర్అండ్‌బీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

**నిబంధనలు పాటిస్తేనే రక్షణ**

వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని కలెక్టర్ సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, సిగ్నల్ జంపింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్, అతివేగం, ప్రమాదకరంగా ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని, తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు.

**గోల్డెన్ అవర్‌లో స్పందించాలి**

ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం




ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన ఉత్తమ సమరిటన్‌లకు ప్రభుత్వం రూ.25 వేల నగదు పురస్కారంతో పాటు అభినందన పత్రం అందజేస్తుందని పేర్కొన్నారు. బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లే వారికి పోలీసుల వేధింపులు ఉండవని, వారి వివరాలు వెల్లడించడం వారి ఇష్టానుసారమేనని తెలిపారు.
ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్, 100 లేదా 112 పోలీసు సేవలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారులపై అత్యవసర సహాయం కోసం 1033కు సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్‌కుమార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఎస్పీ తిరుపతిరావు, ఆర్అండ్‌బీ ఈఈతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మండల ప్రజావాణికి పకడ్బందీ ఏర్పాట్లు

**ఖమ్మం/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** మండల స్థాయిలో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు ఈనెల 17 నుంచి మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మండల ప్రజావాణి ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపడంతో పాటు వాటి పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
16లోగా శిక్షణ పూర్తి చేయాలిమండల ప్రజావాణి నిర్వహణకు నియమించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఈనెల 16లోగా శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు.



వారికి లాగిన్ ఐడీలు, వినియోగ మార్గదర్శకాలు అందజేయాలని సూచించారు. ప్రజలు, అధికారులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు తదితర పరికరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. మండల ప్రజావాణిపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా ముందస్తు



సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.
సమీక్షలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు, డీసీవో గంగాధర్, డీఎస్‌వో చందన్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు

# పురుగుమందుల విషయంలో అప్రమత్తత అవసరం





**ఎల్కతుర్తి/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
పురుగుమందుల వినియోగంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూడబ్ల్యూఎఫ్–బీసీఐ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు సూచించారు. జగన్నాథపూర్ గ్రామంలో శుక్రవారం అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు (హెచ్‌హెచ్‌పీ) వినియోగం, పురుగుమందుల మిశ్రమాల వల్ల కలిగే అనర్థాలు, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. బీసీఐ ప్రతినిధి వంగ రఘు మాట్లాడుతూ.. ప్రమాదకర పురుగుమందుల వినియోగంతో రైతుల ఆరోగ్యంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పురుగుమందులను సిఫారసు చేసిన మోతాదులోనే వినియోగించాలని, లేబుల్‌పై ఉన్న సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పిచికారీ సమయంలో మాస్క్, గ్లౌజులు, రక్షణ దుస్తులు తదితర వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలని చెప్పారు.
అగ్నాస్త్రం తయారీపై ప్రదర్శనకార్యక్రమంలో అగ్నాస్త్రం తయారీ విధానాన్ని రైతులకు ఆచరణాత్మకంగా ప్రదర్శించారు. పంటల్లో సహజ పద్ధతుల్లో పురుగులను నియంత్రించేందుకు అగ్నాస్త్రం వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు ప్రదర్శనలో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి సురక్షిత పురుగుమందుల వినియోగం, పీపీఈ వాడకం, పర్యావరణహిత ప్రత్యామ్నాయ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో రైతులకు అగ్నాస్త్రాన్ని పంపిణీ చేశారు.
కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజాల యాదగిరి, ఏఈఓ అనూరిక, బీసీఐ ప్రతినిధులు రావుల లత, సురకంటి రజిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వేలేరులో డ్రైనేజీకి భారీ ఊతం!

### సైడ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం.. త్వరలో మెయిన్ రోడ్డు వెంట నిర్మాణం

**వేలేరు/ ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సైడ్ డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు సర్పంచ్ మీ బిల్లా యాదగిరి శుక్రవారం శ్రీకారం చుట్టారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు



గ్రామంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలో ప్రధాన రహదారి వెంట సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్డు పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, పంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు సురేష్, సునీల్, గ్రామ పెద్దలు పురుషోత్తం, రాజయ్య, రంగం, రాజు, లక్ష్మీనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ఆగ్రహం

**తల్లాడ/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ శ్రేణులు రాజకీయంగా దీటైన సమాధానం ఇస్తాయని హెచ్చరించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఒక వ్యక్తిపై మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వయసులో పెద్దలను గౌరవించే వ్యక్తిత్వం ఉన్న నాయకుడని, ఆయనను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. ప్రజలకు కష్టకాలంలో అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి తనవంతు సాయం చేసే మనస్తత్వం పొంగులేటి సొంతమన్నారు. ఇళ్లపై బహిరంగ చర్చకు సవాల్‌గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఇళ్లు ఇచ్చారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని



ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిందనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కౌశిక్‌రెడ్డి చర్చకు వచ్చే తేదీ, సమయం ప్రకటించాలని కోరారు. మంత్రులు, కాంగ్రెస్ నాయకులపై వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయంగా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# తీజ్ పండుగలో విద్యార్థుల సందడి



**కేసముద్రం/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** కల్వల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పరిమి నవీన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి తీజ్ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పరిమి నవీన్ మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధన, పంటల సమృద్ధి, సుఖసంతోషాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. గిరిజన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సోమయ్య, వీరబాబు, శ్రీదేవి, అరుణ, హెల్త్‌కేర్ సిబ్బంది ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్ రమ్య, శ్వేత, రేణుక, కృష్ణ, నాయక్, పూర్ణనాయక్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## లిటిల్ సిటిజన్ స్కూల్‌లో

# ఘనంగా బోనాల ఉత్సవాలు



**కేసముద్రం/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** అమీనాపురంలోని లిటిల్ సిటిజన్ యూపీఎస్ పాఠశాలలో బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో గ్రామదేవతను ప్రతిష్ఠించి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించారు. తెలంగాణ సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు జానపద గేయాలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సంప్రదాయాలను భావితరాలకు చాటేందుకే..తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయిలు కోటేశ్వర్లు అన్నారు. పండుగల విశిష్టత, ఆచార వ్యవహారాల వెనుక ఉన్న ఉద్దేశాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకే పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాయిలు శకుంతల, ఉపాధ్యాయులు జ్యోతి, రజిత, స్రవంతి, ప్రీతి, శివాని, ప్రశాంతి, ఫర్జానా, సౌజన్య, శిరీషతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

## సెప్టెంబరు 1న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

**నరసన్నపేట/ఆగస్టు 14 (జర్నలిస్ట్ వార్త):**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్ అన్నారు. సెప్టెంబరు 1న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

నరసన్నపేట పరిధిలోని సత్యవరం బ్రిడ్జి జంక్షన్ నుంచి పల్లిపేట జంక్షన్ వరకు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్న శ్రీనివాస్, బొత్స సంతోష్ మాట్లాడుతూ.. 'ప్రజల కోసం.. ప్రజలతో కలిసి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం' అనే నినాదంతో ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. పాదయాత్రలో ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నామన్నారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తూ.. ప్రజల గొంతుకను ప్రభుత్వాలకు వినిపించడమే తమ పోరాట యాత్ర ఉద్దేశమన్నారు.ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి కుల, మత, ప్రాంత, భాష పేరుతో విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచే చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు, దేశ సమగ్రత, సమైక్యత కోసం చేపడుతున్న పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సెప్టెంబరు 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆర్.అరవింద్, నాయకులు నారాయణరావు, మధు, రమణ, భాస్కర్‌రావు, లవకుమార్, సాంబశివరావు, అమోష్, ధర్మారావు, సామకృష్ణ, వెంకటరావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు

# సత్తుపల్లిలో కదం తొక్కిన తిరంగా ర్యాలీ

**సత్తుపల్లి/ ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో భాజపా ఆధ్వర్యంలో శుక్రవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో విద్యార్థులు, జాతీయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 500 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని చేతబూని పట్టణ ప్రధాన వీధుల గుండా సాగడంతో దేశభక్తి వాతావరణం నెలకొంది.త్యాగధనుల స్ఫూర్తిని చాటాలిఈ సందర్భంగా నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ దేశ పౌరులంతా ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీ విజయవంతానికి సహకరించిన విద్యార్థులు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.భాజపా రాష్ట్ర





కార్యవర్గ సభ్యుడు ఇవీ రమేష్ మాట్లాడుతూ.. యువతలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడంతో పాటు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు నివాళు లర్పించేందుకు తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ణి వీరంరాజు, సుదర్శన మిశ్రా, జిల్లా కార్యదర్శి పాలా నాగ సురేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా, సత్తుపల్లి మండల ప్రభారి అల్లిక అంజయ్య, తిరుమలాయపాలెం మండల ప్రభారి నల్లమోతు నానిబాబు, సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్, సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ, వేంసూరు మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణమాస మొదటి శుక్రవారం పూజల కోసం పోటెత్తిన మహిళా భక్తులు.





**బయ్యారం/,ఆగస్టు 14.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాస మొదటి శుక్రవారం సందర్భంగా పూజా కార్యక్రమంలో భాగంగా సాక్షాత్ శ్రీ లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం,వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు సుదర్శనాచార్యులు తెలిపారు.ముత్తైదువులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పసుపు,కుంకుమలు సమర్పించుకుని తల్లి సేవలో తరించారు.అమ్మవారిని దర్శించుకుని అమ్మ సేవలో తరించేందుకు అధిక సంఖ్యలో మహిళా భక్తులు రావడంతో ఆలయం భక్తులతో సందడిగా మారింది.భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.శ్రావణమాసం సందర్భంగా శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నాలుగు శుక్రవారాలు కూడా ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,రాబోయే శుక్రవారాల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి అనుగ్రహానికి కృపకు పాత్రులు కాగలరని ఆలయ అర్చకులు సుదర్శనా చార్యులు అన్నారు.

# ఏఐతో ఐటీ రంగంలో సమూల మార్పులు

**విద్యార్థులు నూతన నైపుణ్యాలపై దృష్టి సారించాలి -కిట్స్ వరంగల్‌లో ఎల్‌టీఐ మైండ్‌ట్రీ లీడర్‌షిప్ మాస్టర్‌క్లాస్**





**హసన్‌పర్తి,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
కృత్రిమ మేధ (ఏఐ)తో ఐటీ రంగంలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని, విద్యార్థులు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ప్రతినిధులు సూచించారు. కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన లీడర్‌షిప్ మాస్టర్‌క్లాస్‌లో వారు మాట్లాడారు.ఎల్‌టీఐ మైండ్‌ట్రీ హైదరాబాద్ ప్రిన్సిపల్ డైరెక్టర్ బ్రహ్మ ముత్య, రీజినల్ హెడ్‌టాలెంట్ అక్విజిషన్ గ్రూప్ మాచర్ల కిరణ్‌కుమార్ విద్యార్థులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. 'ఏఐ ఐటీ రంగాన్ని ఎలా మారుస్తోంది.. నైపుణ్యాలపై అంచనాలను ఎలా పునర్నిర్వచిస్తోంది' అనే అంశంపై అవగాహన కల్పించారు. సంప్రదాయ కోడింగ్ నుంచి ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాల వైపు పరిశ్రమ దృష్టి మళ్లుతోందన్నారు. విద్యార్థులు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని సూచించారు.

**671 ప్లేస్‌మెంట్లు**

కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 202526 విద్యా సంవత్సరంలో విద్యార్థులు 671 క్యాంపస్ ప్లేస్‌మెంట్లు సాధించారని తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

**400 మందికి పైగా హాజరు:**2027లో బీటెక్ పూర్తి చేయనున్న 400 మందికి పైగా విద్యార్థులు మాస్టర్‌క్లాస్‌కు హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ సంస్థల్లో ఏఐ ప్రాజెక్టుల పనితీరు, ఆటోమేషన్ విధానాల్లో తీసుకొస్తున్న మార్పులపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందారు. ఏఐ ఆధారిత అభివృద్ధి, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలకు భవిష్యత్‌లో మరింత ప్రాధాన్యం ఉంటుందని వక్తలు వివరించారు.కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ విభాగాన్ని అభినందించారు.కార్యక్రమంలో టీపీఓ డా. టి. చంద్రబాయి, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ ఇ. కిరణ్‌కుమార్, డీన్లు, విభాగాధిపతులు, పీఆర్ఓ డా. డి. ప్రభాకరాచారి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డి భూ కుంభకోణం

**సోదరుడి కంపెనీకి ఐదెకరాలు కేటాయింపు**

**లోకాయుక్తలో బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**హైదరాబాద్,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ భూ కుంభకోణం పై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ , ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ , ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ , ఎమ్మెల్సీ కోటి రెడ్డి , కార్పొరేషన్ మాజీ చైర్మన్ కృష్ణక్, లీగల్ సెల్ అడ్వకేట్ లలిత రెడ్డి, విశ్వేశ్వర్ , కళ్యాణ్ తదితరులు లోకాయుక్త జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎం తమ్ముడు కొండల్ రెడ్డి 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ. 200 కోట్ల విలువైన భూములను కేటాయించారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 5 ఎకరాల ప్రజా భూమిని కేవలం రూ. 7 కోట్లకు దారాదత్తం చేశారని విమర్శించారు. ఏరోస్పేస్ కంపెనీ అని చెప్పుకుంటున్న టెస్సెరాక్ట్ చెల్లించిన మూలధనం కేవలం రూ. లక్ష



మాత్రమేనని, టెస్సెరాక్ట్ కంపెనీ అధికారిక బోర్డు నివేదిక ప్రకారం కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 'సున్నా' అని తేలిందని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. నివాస ఎ÷–లాట్ అడ్రస్‌తో నడుస్తున్న కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన డిఫెన్స్ భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీయడంతో రాత్రికి రాత్రే వెబ్‌సైట్‌లో వివరాలను మార్చేశారని తెలిపారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్‌గా, సీఎం మేనల్లుడు నయన్ రెడ్డి సీఈవోగా ఉన్నారని లోకాయుక్తకు ఆధారాలు సమర్పించామ ని వెల్లడించారు. మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో అబద్దాలు చెబితే, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ భూ కేటాయింపులను స్వయంగా ఒప్పుకున్నారని వివరించారు. రికార్డుల్లో కొండల్ రెడ్డి పేరు లేకుండా బినామీలను పెట్టారని ఆరోపించారు. కర్ణాటక 'ముడా' తరహాలోనే తెలంగాణలో టెస్సెరాక్ట్ భూ కుంభకోణం సాగిందని దుయ్యబట్టారు. టెస్సెరాక్ట్ భూ కేటాయింపులను వెంటనే నిలిపివేసి రద్దు చేయాలని , సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై విచారణ కోసం నివేదికను గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ అధికారులపై అవినీతి నిరోధక చట్టం, బీఎన్ఎస్ సెక్షన్ల కింద విచారణకు బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి

**మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం,/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం జిల్లా అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలే స్ఫూర్తిగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ఉపాధి రంగాల్లో అనేక కీలక కార్యక్రమాలను బీఆర్ఎస్ హయాంలో చేపట్టామని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తాను మంత్రిగా ఖమ్మం ప్రజల ప్రయోజనాలను, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనేక అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు.




# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

**హైదరాబాద్/ఆగస్టు 14 (జర్నలిస్ వార్త):**
అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థీవ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.

